సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 19 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 15 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరిన రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/22.4°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత కొనసాగింది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రామావతారా...ఖాద్రీశా



రామావతార అలంకారంలో ఖాద్రీశుడు

కదిరి టౌన్‌: శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ఆలయాల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం కదిరిలోని ఖాద్రీశుడు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేత ధనస్సు పట్టి దేవేరులతో కలిసి కనిపించిన స్వామివారిని దర్శించుకుని జనం తరించారు. ఇక కదిరిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పార్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఖాద్రీ ఆలయ పాలక మండలి చైర్మన్‌ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 43 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్‌: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ బుధవారం 43.808 టీఎంలకు తగ్గింది. 1612.99 అడుగుల వద్ద నీటి మట్టం ఉండగా ఇన్‌ఫ్లో 657, అవుట్‌ఫ్లో 10,534 క్యూసెక్కులుంది. కాలువలకు వదులుతున్న నీటితో పాటు ఆవిరి రూపంలో వారానికి 6 టీఎంసీల నీరు ఖర్చవుతోంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్‌ వద్ద) 1,670 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1632.88 అడుగులతో 105.306 టీఎంసీల నీటి నిల్వతో 39,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 28,007 క్యూసెక్కుల అవుట్‌ ఫ్లో ఉండేది.


నేడు ఆర్టీసీ ఆస్పత్రి భవనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆస్పత్రి భవనం

అనంతపురం సెంట్రల్‌: అనంతపురం బస్టాండ్‌ ఆవరణలో ఆర్టీసీ ఆస్పత్రి నూతన భవనాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్‌ ఆర్‌ ఆదోని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి, ప్రజాప్రతినిధులతో పాటు ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు హాజరవుతారని వివరించారు. దాదాపు రూ.కోటి వ్యయంతో రూపుదిద్దుకున్న ఆస్పత్రి భవనంతో పాటు కార్గో పార్సిల్‌ కేంద్రాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. ఇక నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

నిలువు దోపిడీ



ప్రైవేట్‌ ఆస్పత్రుల యాజమాన్య ధన దాహానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. వైద్యులు డబ్బు సంపాదన కోసం రోగులకు అవసరం లేని పరీక్షలు, స్కానింగులు చేయిస్తున్నారు. రోగి ఆర్థిక పరిస్థితిని ఏమాత్రమూ పరిగణనలోకి తీసుకోకుండా నిలువుదోపిడీ చేస్తూ అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు.

- బరి తెగిస్తున్న ప్రైవేట్‌ ఆస్పత్రులు
- ధనార్జనే ధ్యేయంగా టెస్టులు, స్కానింగులు
- స్కానింగ్‌ సెంటర్లలో వైద్యులే భాగస్వాములు
- రోగి వద్ద డబ్బు లేకపోతే ఆభరణాల స్వీకరణ
- చితికిపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

❒ వారం రోజుల క్రితం ఉరవకొండకు చెందిన ఓ మహిళ అనంతపురంలోని రామ్‌నగర్‌ ఫ్లై ఓవర్‌ సమీపాన గల ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లింది. ఆస్పత్రి యాజమాన్యం చికిత్సకు భారీగా చార్జ్‌ వేశారు. ఉన్న డబ్బు చాలక పోవడంతో ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు తీసుకున్నారు. తర్వాత డబ్బు కట్టి గాజులను విడిపించుకు వెళ్లినట్లు రోగి తెలిపింది.

❒ గుత్తికి చెందిన ఓ ఎనిమిదేళ్ల బాలిక చెవి నొప్పితో బాధపడుతూ అనంతపురం సాయినగర్‌లోని ఓ ఈఎన్‌టీ డాక్టర్‌ వద్దకు వచ్చింది. ఆ అమ్మాయికి రకరకాల టెస్టులు రాయడంతో రూ.4వేల బిల్లు అయింది. ఈ టెస్టుల్లో హెచ్‌ఐవీ టెస్టు కూడా ఉంది. దీన్నిబట్టి డాక్టరు ఎంత దారుణంగా టెస్టులు రాశారో అర్థం చేసుకోవచ్చు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో కొన్ని ప్రాణం పోసే స్థాయి నుంచి ప్రాణం తీసే స్థాయికి దిగజారాయి. కొందరు వైద్యులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో అయితే ఇక ఈ ధన దాహానికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. పేషెంటు ఆస్పత్రికి రాగానే రకరకాల టెస్టుల పేరుతో పీల్చి పిప్పి చేస్తున్నారు. తలనొప్పి అనగానే ఎంఆర్‌ఐ, ఛాతిలో నొప్పి అనగానే యాంజోగ్రామ్‌ టెస్టులు రాసేస్తున్నారు. ఇటీవల కొంతమంది బాలింతలు, రోగులు మృతిచెందిన ఘటనలు ప్రైవేటు ఆస్పత్రుల తీరుకు నిదర్శనం.

డబ్బు..డబ్బు..డబ్బు

రోగానికి, డాక్టరు రాసే టెస్టులకు సంబంధమే ఉండడం లేదు. కానీ రోగి డాక్టరును ప్రశ్నించే పరిస్థితి లేకపోవడంతో ఎంతవరకు వీలైతే అంత డబ్బు పిండుతున్నారు. ఒకవేళ ఆరోగ్యశ్రీ కింద రోగి ఆస్పత్రిలో చేరినా టెస్టుల పేరుతో చికిత్సకు ముందే రూ.10 వేల నుంచి రూ.20 వేలు లాగుతున్నారు. ఎంఆర్‌ఐ స్కానింగ్‌ సెంటర్లలో డాక్టర్లే భాగస్వాములు. దీంతో ప్రతి చిన్న జబ్బుకూ ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌ అనేది తప్పనిసరి అయ్యింది. టెస్టులకు భయపడి ఏ ఆస్పత్రికి వెళ్లాలో అర్థం కాక రోగులు సతమతమవుతున్నారు.

ఏజెంట్లుగా ఆర్‌ఎంపీలు

గ్రామాల్లో చాలామంది దూరం వెళ్లలేక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తుంటారు. అయితే జబ్బు ముదిరిన సమయాల్లో ఆర్‌ఎంపీలు అనంతపురంలోని డాక్టర్లకు రెఫర్‌ చేస్తారు. ఆ డాక్టరుకు, ఆర్‌ఎంపీకి ఎప్పటినుంచో లింకు ఉంటుంది. ఇందులో వేసే బిల్లులో కొంత పర్సెంటేజీ ఆర్‌ఎంపీకి వెళుతుంది. ఇలా చాలా ఆస్పత్రులకు ఆర్‌ఎంపీలే ఏజెంట్లుగా, ఆదాయ వనరుగా మారారు. ఆర్‌ఎంపీ నుంచి వెళితే ఎక్కువ సొమ్ము వసూలు చేస్తారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు	321
ఔట్‌పేషెంట్‌లు (సగటున రోజుకు)	15,000
ఇన్‌పేషెంట్‌లు (సగటు)	2,500
టెస్టులు రాస్తున్నది (సగటు)	10,000
కన్సల్టెన్సీ ఫీజు (సగటు)	రూ. 200

ఇష్టారాజ్యంగా టెస్టులు వద్దు



ఇష్టమొచ్చినట్టు టెస్టులు రాయకూడదు. రకరకాల టెస్టు కిట్‌లను దుర్వినియోగం చేయడం వల్ల మరొకరికి అవి ఉపయోగపడవు. పైగా ఇది డాక్టర్‌కు నైతికత అనిపించుకోదు. వీలైనంత వరకూ పేషెంటుకు ఖర్చు తగ్గించే చికిత్స చేయడమే డాక్టర్‌కు ఉండాల్సిన మంచి లక్షణం.

–డా.సిహెచ్‌.ప్రభాకర్‌రెడ్డి, హృద్రోగ నిపుణులు, ఎంసీఐ సభ్యులు

అవగాహన రావాలి



చికిత్స విషయంలో డాక్టరు రోగిని మోసం చేశారని అనిపించినప్పుడు ఏపీ మెడికల్‌ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన రావాలి.

– డాక్టర్‌ బి.సాంబశివారెడ్డి, చైర్మన్‌, మెడికల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఏపీ

నేడు 'జగనన్న చేదోడు' సాయం విడుదల

ఉమ్మడి జిల్లాలో 25,989 మందికి లబ్ధి

అనంతపురం రూరల్‌: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న చేదోడు' పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏటా అర్హత కల్గిన రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారు. కులవృత్తులపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు వీలుగా పెట్టుబడి అవసరాలను తీర్చుకునేందుకు 'చేదోడు' పథకం ఉపయోగపడుతోంది. ఈ పథకం నాలుగో విడతలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బటన్‌ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి ఆర్థికసాయం జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 25,989 మందికి లబ్ధి కలగనుంది. అనంతపురం జిల్లాలో 14,795 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.14.79 కోట్లు జమ కానుంది. శ్రీసత్యసాయి జిల్లాలో 11,194 మంది ఖాతాలకు రూ.11.19 కోట్లు జమ కానుంది. అనంతపురంలో కలెక్టర్‌ కార్యాలయంలో నేడు జిల్లా స్థాయి 'జగనన్న చేదోడు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్‌ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: జూనియర్‌ కళాశాలలకు గురువారం నుంచి 25 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 26న కళాశాలలు పునఃప్రారంభమవుతాయని ఇంటర్‌ బోర్డు సెక్రటరీ ఎంవీ శేషగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల జూనియర్‌ కళాశాలలు విధిగా సెలవులు అమలు చేయాలని ఆర్‌ఐఓ సురేష్‌బాబు ఆదేశించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దసరా పండుగకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: దసరా పండుగ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు మీదుగా యశ్వంత్‌పూర్‌–బీదర్‌, యలహంక–బీదర్‌ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్‌ పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌ సీహెచ్‌ రాకేష్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న యశ్వంత్‌పూర్‌ జంక్షన్‌ (06521) నుంచి రాత్రి 11.15కు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు బీదర్‌ చేరుతుంది. తిరిగి ఈ రైలు (06522) 21వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్‌ జంక్షన్‌ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్‌ చేరుతుంది. యశ్వంత్‌పూర్‌–బీదర్‌ రైళ్లు (06523/24) ఈ నెల 21, 22 తేదీల్లో అదే వేళల్లో నడపనున్నారు. ఇక యలహంక–బీదర్‌ మధ్య ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. 23వ తేదీ రాత్రి 11.30 గంటలకు రైలు (06505) యలహంక జంక్షన్‌ నుంచి బయలుదేరి బీదర్‌ రైల్వేస్టేషన్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది. తిరిగి ఈ రైలు (06506) 24వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్‌ జంక్షన్‌ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుందని చీఫ పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌ వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు చర్యలు

అనంతపురం టౌన్‌: అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్‌ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో కదిరి, అనంతపురం డివిజన్ల పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఓవర్‌ లోడ్‌ సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు అవసరమైన నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని డివిజన్‌ ఇంజినీర్లను ఆదేశించారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌పై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్‌ వినియోగదారుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. అప్పుడే వారికి ప్రభుత్వం అందించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత ఉంటుందన్నారు. జిల్లాలో విద్యుత్‌ సమస్యలు ఎదుర్కొంటున్న వారు 1912 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేసి ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ వసూళ్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజీఎంలు గురవయ్య, ధర్మజ్ఞాని, ఎస్‌ఈ సురేంద్రతోపాటు ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

జిల్లాను హార్టికల్చర్‌ హబ్‌గా తీర్చిదిద్దాలి

- ఇన్‌చార్జ్‌ జాయింట్‌ కలెక్టర్‌ కార్తీక్‌

పుట్టపర్తి అర్బన్‌: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి జిల్లాను హార్టికల్చర్‌ హబ్‌గా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జ్‌ జాయింట్‌ కలెక్టర్‌ కార్తీక్‌ ఆదేశించారు. ఉద్యాన తోటలకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతులకు తెలియజేస్తూ విస్తీర్ణం పెరిగేలా చూడాలన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌ జేసీ కార్తీక్‌ మాట్లాడుతూ... పాడి రైతులకు విరివిగా రుణాలివ్వాలన్నారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖలో రెండంకెల వృద్ధి సాధించడానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఏయే పంటలు పండిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి, 2023 ఖరీఫ్‌, రబీ పంటల ప్రణాళికలపై సమీక్షించారు. 'జగనన్న పాల వెల్లువ' ద్వారా రైతులకు కలిగే లబ్ధి వివరంగా తెలియజేయాలన్నారు. షార్ట్‌ టర్మ్‌ రుణాల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ సుబ్బారావు, సీపీఓ విజయ్‌కుమార్‌, సెరికల్చర్‌ జేడీ పద్మమ్మ, పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్‌, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్‌ జాయింట్‌ కలెక్టర్‌ కార్తీక్‌

నకిలీ సర్టిఫికెట్‌..దొంగ రిజిస్ట్రేషన్‌

- ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో బోగస్‌ రిజిస్ట్రేషన్‌ దందా
- 2019లో నకిలీ పత్రాలతో వృద్ధురాలి స్థలాన్ని కాజేసిన వైనం
- ఆలస్యంగా తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- సబ్‌రిజిస్ట్రార్‌ నారాయణస్వామితోపాటు వెంకటదాస్‌లపై కేసు నమోదు



ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం

ధర్మవరం: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సామాన్యుల ఆస్తులకు రెక్కలొచ్చాయి. అవి ఎటు ఎగిరిపోయాయో తెలియనంతగా చేతులు మారిపోయాయి. ఖాళీ స్థలం కనబడితే చాలు టీడీపీ నేతలు కబ్జా చేయడం...నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడం ఆనవాయితీగా జరిగిపోయాయి. ఈ దారుణాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. తాజాగా పట్టణానికి చెందిన తిరుపాల్‌శెట్టి భార్య భాగ్యరంగమ్మకు చెందిన స్థలానికి నకిలీ పత్రాలను సృష్టించి ఆపై దొంగ రిజిస్ట్రేషన్‌ చేయించి అమ్మేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

అసలేం జరిగిందంటే...

నేసేపేటకు చెందిన తిరుపాల్‌శెట్టి, భాగ్యరంగమ్మ దంపతులకు కుమారుడు సంతానం. అతను కూడా విదేశాల్లో స్థిరపడ్డాడు. దీంతో దంపతులిద్దరే ధర్మవరంలో ఉండేవారు. ఈ క్రమంలో తిరుపాల్‌శెట్టి మృతి చెందగా భాగ్యరంగమ్మ ఒంటరిగా ఉంటోంది. వీరికి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆస్తులున్నాయి. శివరాం నగర్‌లో సర్వే నంబర్‌ 578, 579లలోని 4 సెంట్ల స్థలం బహిరంగ మార్కెట్‌లో దాదాపుగా రూ.80 లక్షలకుపైగా పలుకుతోంది. ఆ స్థలంపై కన్నేసిన టీడీపీ నేత వెంకటదాస్‌ దాన్ని చేజిక్కించుకునేందుకు సబ్‌రిజిస్ట్రార్‌ నారాయణ స్వామితో కలిసి ప్లాన్‌ వేశాడు. తిరుపాల్‌శెట్టి నకిలీ డెత్‌సర్టిఫికెట్‌, భాగ్యరంగమ్మ పేరుతో మరో వృద్ధురాలికి ఆధార్‌ సృష్టించాడు. 2019 సెప్టెంబర్‌ 25న సదరు మహిళను భాగ్యరంగమ్మగా చూపి తన పేరుమీదే రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాడు. అనంతరం ఆ స్థలాన్ని వేరొకరికి విక్రయించాడు. వచ్చిన మొత్తాన్ని టీడీపీ నేత వెంకటదాస్‌, సబ్‌రిజిస్ట్రార్‌ నారాయణస్వామి తలా కొంత పంచుకున్నట్లుగా తెలుస్తోంది.

బండారం బట్టబయలైందిలా..

మూడు రోజుల క్రితం తన స్థలాన్ని చూసుకునేందుకు భాగ్యరంగమ్మ వెళ్లగా అది వేరొకరు కొనుగోలు చేసినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. దీంతో ఆమె స్థలానికి సంబంధించిన ఒరిజినల్‌ పత్రాలు తన దగ్గరే ఉన్నాయని, తాము ఎవరికీ విక్రయించలేదని తెలిపింది. అయినా ఆ స్థలం తమదేనంటూ కొందరు ముందుకు రాగా, భాగ్యరంగమ్మ పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. తమ స్థలాన్ని ఎవరో కాజేశారనీ, న్యాయం చేయాలని కోరింది. పోలీసులు ఆరా తీయగా... బాధితురాలి పేరుతో నకిలీ ఆధార్‌ సృష్టించి, ఆమె భర్త డెత్‌ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసి వాటి ద్వారా వేరొక మహిళతో అక్రమ రిజిస్ట్రేషన్‌ చేయించినట్లు గుర్తించారు. ఈ దందాలో కీలక సూత్రధారులైన వెంకటదాస్‌, అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌ నారాయణస్వామిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. త్వరలోనే ఈ అక్రమ దందాకు సంబంధించిన వివరాలు పోలీసులు నిగ్గు తేల్చనున్నారు. గతంలో సదరు సబ్‌రిజిస్ట్రార్‌ నారాయణస్వామిపై పలు అవినీతి ఆరోపణలున్నాయి. ఇంకా ఇలాంటి ఫేక్‌ రిజిస్ట్రేషన్‌లు చాలానే జరిగాయని, వాటన్నింటిపైనా విచారణ జరిపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఊ కొడితే... ఊడ్చేస్తారు!

పెచ్చు మీరుతున్న సైబర్‌ మోసాలు

- ప్రజల అమాయకత్వంతో ఆడుకుంటున్న నేరగాళ్లు
- వివిధ పథకాల పేరుతో బురిడీ కొట్టిస్తున్న వైనం
- బాధితులు 1930 నంబర్‌కు కాల్‌ చేయాలని అధికారుల సూచన
- తక్షణ ఫిర్యాదుతో నగదు రికవరీ అవకాశం ఉంటుందని వెల్లడి



» ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన పట్టు చీరల వ్యాపారి రాజేంద్రకు ఇటీవల ఓ అపరిచితుడు కాల్‌ చేశాడు. 'మీ సిబిల్‌ స్కోర్‌ బాగుంది. తక్కువ వడ్డీకే రుణం ఇస్తాం' అని మాట కలిపాడు. లోన్‌ కావాలంటే బ్యాంక్‌ ఖాతా వివరాలతో పాటు సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని కోరగా, తక్కువ వడ్డీకే రుణం మంజూరవుతుందని ఆశపడిన రాజేంద్ర...వెంటనే ఓటీపీ చెప్పాడు. కట్‌ చేస్తే క్షణాల్లోనే అతని బ్యాంక్‌ ఖాతాలోని రూ.20 వేలు మాయమైంది.

» పుట్టపర్తికి చెందిన రమేష్‌ చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అతనికి ఓ అజ్ఞాత వ్యక్తి కాల్‌ చేసి 'మీకు క్రెడిట్‌ కార్డు మంజూరైంది...ఈ కార్డు ద్వారా ప్రతినెలా రూ.50 వేల వరకు వడ్డీ లేకుండా లోన్‌ తీసుకోవచ్చు' అని చెప్పాడు. అందుకు ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాలని కోరగా, రమేష్‌ వెంటనే చెప్పేశాడు. క్షణాల్లోనే రమేష్‌ ఖాతాలోని రూ.50 వేలు మాయమైంది.

...ఇలా రోజూ ఎక్కడోచోట సైబర్‌ నేరం వెలుగుచూస్తోంది. సైబర్‌ నేరగాళ్లు అమాయకులను టార్గెట్‌ చేసి తక్కువ వడ్డీకి రుణం ఇస్తామనో, క్రెడిట్‌ కార్డు ఇస్తామనో ఆశపెట్టి మోసం చేస్తున్నారు. సైబర్‌ నేరగాళ్లు చెప్పినవాటికంతా ఊ కొడుతూ వివరాలన్నీ చెప్పేస్తే ఖాతా ఖాళీ అవుతుంది జాగ్రత్త అంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ధర్మవరం: గతంలో బ్యాంకు ఖాతాలో డబ్బుంటే దాని గురించి ఆలోచించాల్సిన పని ఉండేది కాదు. కానీ ఇప్పుడు రోజుకోసారైనా బ్యాలెన్స్‌ చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సైబర్‌ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. కొందరికి తెలియకుండానే వారి ఖాతాలోనే సొమ్ము మాయం అవుతుండగా, మరికొందరు మాత్రం సైబర్‌ నేరగాళ్ల వలకు చిక్కి వివరాలన్నీ చెప్పి నిలువుదోపిడీకి గురవుతున్నారు. నెట్టింట వేదికగా ఇటీవల సైబర్‌ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో ప్లాన్‌తో ప్రజలను బురిడీ కొట్టించి ఖాతాలలో నగదును మాయం చేస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు.

బ్రహ్మాస్త్రంలా మారిన 1930

సైబర్‌ మోసాలు పెరిగిపోతుండగా...ప్రభుత్వం కూడా తగు చర్యలు చేపట్టింది. సైబర్‌ మోసగాళ్ల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అంతేకాకుండా సైబర్‌ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే 1930 కాల్‌ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. సైబర్‌, ఆన్‌లైన్‌ మోసాలకు గురైన బాధితులకు 1930 కాల్‌సెంటర్‌ బ్రహ్మాస్త్రంలా పనిచేస్తోంది.


ఫిర్యాదు ఇలా...

- సైబర్‌ బాధితులు తొలుత సైబర్‌ క్రైమ్‌ హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930కు ఫోన్‌ చేసి విషయం తెలపాలి.
- అలాగే బ్యాంక్‌ కస్టమర్‌ కేర్‌కు కాల్‌ చేసి క్రెడిట్‌, డెబిట్‌ కార్డులు, లావాదేవీలను బ్లాక్‌ చేయించాలి.
- సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి ఎఫ్‌ఐఆర్‌ నమోదయ్యేలా చేయాలి.
- బ్యాంక్‌ లావాదేవీల వివరాలు, ఎఫ్‌ఐఆర్‌ కాపీలను బ్యాంక్‌ వారికి సమర్పించాలి.
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలంటే https:/cybercrime.gov.in వెబ్‌సైట్‌కు వెళ్లి లాగిన్‌ అయ్యి వివరాలు నమోదు చేయాలి.

తక్షణ ఫిర్యాదుతో సత్వర న్యాయం

ఎవరి బ్యాంకు ఖాతాలోని డబ్బు మాయమైనా.... లేదా ఓటీపీ చెప్పి సైబర్‌ నేరగాళ్ల బారిన పడినా... బాధితులు వెంటనే 1930 కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయాలి. ఈ కాల్‌ సెంటర్‌ 24 గంటలూ పని చేస్తుంది. ఈ కాల్‌సెంటర్‌లో అన్ని బ్యాంకులు, యూపీఐ వ్యాలెట్లకు చెందిన ప్రతినిధులు, సిబ్బందితో అనుసంధానమై ఉంటారు. ఫిర్యాదు అందగానే బాధితుడి లావాదేవీల వివరాలన్నీ తీసుకొని ఏ బ్యాంక్‌ ఖాతానుంచి డబ్బు పోగొట్టుకున్నారో తెలుసుకుని ఆ బ్యాంక్‌ నోడల్‌ అధికారికి సమాచారం ఇస్తారు. బాధితుడి ఖాతాను పరిశీలించి నగదు ఏ ఖాతాకు బదిలీ అయిందో గుర్తించి సంభందిత బ్యాంక్‌ అధికారికి సమాచారం ఇస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకున్నారో ఆ బ్యాంక్‌ ఖాతాను ఫ్రీజ్‌ చేస్తారు. అంతేకాక బాధితుని ఖాతాలో లావాదేవీలన్నీ బ్లాక్‌ చేస్తారు. ఈ క్రమంలో సైబర్‌ నేరగాళ్లు కొట్టేసిన డబ్బు ఏదో ఒక బ్యాంకులో ఫ్రీజ్‌ అయి ఆ ఖాతాల వివరాల ఆధారంగా మోసం చేసిన వారిని గుర్తించే వీలు కలుగుతుంది. ఒకవేళ అకౌంట్‌ ఫ్రీజ్‌ చేసేలోగా నగదును విత్‌డ్రా అయితే నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులకు ఇచ్చే సాంకేతిక ఆధారాల సాయంతో నేరస్తులను పట్టుకోవడానికి సులభమవుతుందని సైబర్‌ నిపుణులు సూచిస్తున్నారు.

అప్రమత్తతతోనే కట్టడి



అపరిచిత వ్యక్తులు కాల్‌ చేసి ఓటీపీలు అడిగితే అస్సలు చెప్పకూడదు. అప్రమత్తతోనే సైబర్‌ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఎవరైనా సైబర్‌ మోసాలకు గురైనా వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌ చేస్తే...ఆ ఖాతాలను బ్లాక్‌ చేసి డబ్బును వేగవంతం రికవరీ అయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు సైబర్‌ మోసాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

–సుబ్రమణ్యం, పట్టణ సీఐ, ధర్మవరం

విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని బావిలో విసిరేసిన పొలం యజమాని


రామచంద్రనాయుడు (ఫైల్)

గాండ్లపెంట: పొలానికి అనధికారికంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగలి వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయం కాస్త వెలుగు చూడనివ్వకుండా సదరు రైతు ఆ మృతదేహాన్ని బావిలో పడేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం సామలగొంది పంచాయతీ సింగానివారిపల్లికి చెందిన కె.రామచంద్రనాయుడు (40) శనివారం ఉదయం తన పాడి ఆవును కురుమామిడికి వెళ్లే మార్గంలో ఉన్న తుమ్మచెట్లకుంటలో బావి వద్ద కట్టేసి వ్యక్తిగత పనిపై రెక్కమానుకు వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం నడకదారి గుండా స్వగ్రామానికి వస్తూ బావి వద్ద కట్టేసిన ఆవును ఇంటికి తోలుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఆ మార్గంలో కురుమామిడికి చెందిన రైతు గంగిశెట్టి తన వేరుశనగ పంటను పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పొలం యజమాని, తన కుటుంబసభ్యులు, మరికొందరి సాయంతో రామచంద్రనాయుడు మృతదేహానికి ఎనిమిది అడుగుల పొడవున్న రెండు సిమెంటు తీర్లు తంతితో కట్టి వ్యవసాయ బావిలో పడేశాడు. అప్పటి నుంచి ఈ విషయం వెలుగుచూడలేదు. కాగా, శనివారం ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదంటూ బుధవారం ఉదయం పోలీసులకు రామచంద్రనాయుడు భార్య అంజనమ్మ ఫిర్యాదు చేసింది. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు రామచంద్రనాయుడి ఆచూకీ కోసం గాలిస్తూ రైతు గంగిశెట్టి పొలంలోని బావిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న అంజినమ్మ, కుమారుడు, కుమార్తె అక్కడకు చేరుకుని మృతుడిని రామచంద్రనాయుడిగా ధ్రువీకరించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 20 తులాల బంగారం, కిలో వెండి, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఏపీ, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో దొంగతనాలు సాగిస్తున్న జిల్లాకు చెందిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి పెద్ద మొత్తంలో బంగారం, వెండి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించారు.

తాళం వేసిన గృహాలే లక్ష్యం

హిందూపురానికి చెందిన ఎస్.దాదాపీర్ అలియాస్ దాదు, కావడి మహేంద్ర, పరిగి మండలం నర్సాపురం నివాసి తలారి నవీన్‌కుమార్.... ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురూ ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం ఏపీ, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. ఆయా కేసుల్లో నిందితులుగా పట్టుబడి జైలు జీవితం గడిపిన అనంతరం తిరిగి వచ్చిన ముగ్గురూ ఓడీచెరువు, గోరంట్ల, హిందూపురం వన్ టౌన్, టూ టౌన్, పరిగి ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలను యథేచ్ఛగా కొనసాగిస్తూ వచ్చారు. ఆయా కేసుల దర్యాప్తులో దొంగతనాలకు పాల్పడింది ఈ ముగ్గురేనని పక్కా ఆధారాలతో గుర్తించిన పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి జిల్లా వ్యాప్తంగా జల్లెడ పట్టారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

రూ.17.12 లక్షల సొత్తు స్వాధీనం

అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన నల్లమాడ, ఎస్‌బీ సీఐలు రాజేంద్రయాదవ్, రవీంద్రారెడ్డి, సీసీఎస్ నేతృత్వంలో పోలీసులు బుధవారం ఉదయం హిందూపురానికి చేరుకుని విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బస్టాండ్ ప్రాంతంలో తచ్చాడుతున్న దాదాపీర్, మహేంద్ర, నవీన్‌కుమార్‌ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాము చేసిన చోరీలను వారు అంగీకరించడమే కాక, దాచిపెట్టిన రూ.17,12,500 చోరీ సొత్తు వివరాలను వెల్లడించారు. దీంతో పోలీసులు రంగంలో దిగి నిందితులు తెలిపిన ప్రాంతం నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 20 తులాల బంగారు నగలు, రూ.7.5 లక్షలు విలువ చేసే కిలో వెండి సామగ్రి, ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు ఉపయోగిస్తున్న ఇనుప రాడ్‌ను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చోరీలకు అడ్డుకట్ట వేస్తాం

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. చోరీలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమన్నారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేసి చోరీలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నప్పుడు పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడం ద్వారా నేరాలను అరికట్టినట్లవుతుందన్నారు. అనంతరం అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐలు రవీంద్రారెడ్డి, రాజేంద్రయాదవ్, సిబ్బందిని అభినందిస్తూ రివార్డులు అందజేశారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం


మాట్లాడుతున్న సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

హిందూపురం అర్బన్: ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దామంటూ విద్యార్థులకు సెబ్ జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై హిందూపురంలోని బాలయేసు కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా సెబ్ సూపరెంటెండెంట్ రవికుమార్‌తో కలసి ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయన్నారు. డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంటూ మత్తుకు బానిస కాకుండా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల విక్రయంపై టోల్‌ఫ్రీ నెంబర్ 14500కి సమాచారం అందించాలని కోరారు. సెబ్ సీఐ సువర్ణలత, బాలయేసు కళాశాల నిర్వాహకుడు శౌరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

రామగిరి: ఆటో ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం చెర్లోపల్లికి చెందిన నరసింహులు (50), సుశీలమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో హెలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన నరసింహులు... కుంటిమద్ది సమీపంలోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

కదిరి టౌన్: స్థానిక ఇండియన్ గ్యాస్ కార్యాలయం సమీపంలోని నిజాంవలీ కాలనీకి చెందిన నారాయణమ్మ(72) ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందింది. పుట్టుచెవుడుతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం రైలు వస్తున్న విషయాన్ని గుర్తించక పట్టాలు దాటేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో ధర్మవరం నుంచి నర్సాపురం వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా తెలిపారు.

ఘనంగా వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం

- రుద్రహోమంతో ప్రారంభమైన యాగ క్రతువు
- ఏడు రోజుల పాటు సాగనున్న యజ్ఞం


వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు


రుత్వికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ రుత్వికుల వేదఘోష నడుమ సత్యసాయి సన్నిధిలో వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ స్థాపించిన కలశాన్ని తీసుకుని ప్రధాన వేదపండితుడు శ్రీమన్నారాయణ దంపతులు ముందు నడవగా రుత్వికులు అనుసరించారు. సాయి కుల్వంత్ సభా మందిరం నుంచి పూర్ణచంద్ర ఆడిటోరియానికి చేరుకుని కలశ స్థాపన చేసిన అనంతరం రుద్రహోమంతో యాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రుత్వికులకు నూతన వస్త్రాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, పలువురు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన మహిళ


పట్టుబడిన దొంగ


పట్టించిన శారదమ్మ

అమరాపురం: అర్ధరాత్రి ఇంట్లో చొరబడిన దొంగను ఓ మహిళ చాకచక్యంగా బంధించింది. వివరాలు.. అమరాపురంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శారదమ్మ ఇంట్లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రవి ఇటీవల ఇంటికి తాళం వేసి తన సొంతూరు కదిరికి వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి తలుపులు తెరచి ఇంట్లోకి చొరబడ్డారు. బుధవారం వేకువజాము 3 గంటలకు మిద్దెపై నివాసముంటున్న శారదమ్మ మేల్కొని కింద ఇంట్లో నుంచి వస్తున్న శబ్దాన్ని గమనించి అక్కడకు చేరుకుంది. లోపలకు వెళ్లలేక బయటి నుంచి గట్టిగా ఎవరూ అంటూ కేకలు వేయడంతో నేను సురేష్ నంటూ అవతలి వ్యక్తి నమ్మబలికే ప్రయత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె వెంటనే ప్రధాన గేట్‌కు తాళం వేసి, ఇరుగు పొరుగు వారిని పిలిచింది. అక్కడకు చేరుకున్న ఉపాధ్యాయుడు ముద్దరంగప్ప, మరికొందరు లోపలకు వెళ్లి ఓ యువకుడిని పట్టుకున్నారు. విచారణలో తన పేరు రాజు అని, హాసన్ జిల్లా బేలూరుగా పేర్కొన్నాడు. తనతో పాటు మరో ముగ్గురు వచ్చారని వివరించాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రామాంజనేయులు అక్కడకు చేరుకుని నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఘటనపై ఇన్‌చార్జ్ ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఒంటరిగానే దొంగను పట్టుకున్న శారదమ్మ ధైర్యసాహసాలను ఈ సందర్భంగా గ్రామస్తులు కొనియాడారు.

నకిలీ సర్టిఫికెట్లపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఓరియంటల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్, హర్యానా స్టేట్ బోర్డు పేరుతో నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కోరారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లతో అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన బోర్డు జారీ చేసిన పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లతో పాటు దేశవ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి పొందిన 50 ఎస్ఎస్‌సీ బోర్డులు, 51 ఇంటర్ బోర్డులు జారీ చేసిన పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు మాత్రమే మన రాష్ట్రంలో చెల్లుబాటు అవుతాయన్నారు. నకిలీ సర్టిఫికెట్ల విషయంలో ఎలాంటి ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తప్పవని కోఆర్డినేటర్లను హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరి కోఆర్డినేటర్లతో స్వీయ ధ్రువీకరణపత్రాలు తీసుకున్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లాజర్, ఉమ్మడి జిల్లాల డీవైఈఓలు పద్మప్రియ, రంగస్వామి, అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాల వ్యాపారి దుర్మరణం

ఉరవకొండ: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ పాల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం రాకెట్ల నివాసి రైతు విష్ణువర్ధన్ (31) పాల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం వ్యక్తిగత పనిపై చాబాలకు వెళ్లి ట్రాక్టర్ నడుపుతూ తిరుగు ప్రయాణమయ్యాడు. ఉరవకొండ శివారులోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో మలుపులో ట్రాక్టర్ బోల్తాపడింది. ఘటనలో విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

భర్తపై కత్తితో దాడి

- పోలీసుల అదుపులో నిందితురాలు

అనంతపురం క్రైం: క్షణికావేశంలో భర్తపై కత్తితో దాడి చేసిన మహిళ ఉదంతం అనంతపురంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన గొల్ల జయసూర్యారెడ్డి, ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం కుటుంబంతో సహా అనంతపురానికి వలసవచ్చిన జయసూర్యారెడ్డి.. కోవూరు నగర్‌లో నివాసముంటూ టవర్ క్లాక్ వద్ద ఉన్న ఓ మెడికల్ స్టోర్‌లో సేల్స్‌బాయ్‌గా పనిలో చేరాడు. ప్రమీల సైతం ఇంటి పట్టునే టైలరింగ్ చేస్తూ భర్తకు చేదోడుగా ఉండేది. అయితే చిన్నపాటి అంశానికి సైతం తీవ్రంగా ఉద్రేకపడే ప్రమీలకు మానసిక వైద్య నిపుణులతో చికిత్స అందజేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భోజనం ముగించుకుని పిచ్చాపాటి మాట్లాడుకుంటుండగా దంపతుల మధ్య వివాదం చెలరేగింది. ఆ సమయంలో తన చేతికి అందుబాటులో ఉన్న పదునైన కత్తితో భర్త తలపై ప్రమీల దాడి చేసింది. నడి నెత్తి మీది భాగం సగానికి పైగా చీలింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న నాల్గో పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు రాబట్టుకున్నారు. ప్రమీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సురక్ష శిబిరాలకు విశేష స్పందన

- బుధవారం జిల్లాలో 16 వైద్య శిబిరాల నిర్వహణ
- 4,965 మందికి ఓపీ సేవలు


తాడిమర్రిలో నిర్వహించిన సురక్ష శిబిరంలో ఓ వృద్ధురాలికి వైద్యసేవలందిస్తున్న వైద్యురాలు

ప్రశాంతి నిలయం: నిరుపేదల ఆరోగ్యానికి వైఎస్ జగన్ సర్కార్ పెద్ద పీట వేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో గ్రామీణ ప్రాంతాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన సేవలందిస్తోంది. బుధవారం జిల్లాలోని 14 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 2 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. 4,965 మందికి ఓపీ సేవలందించారు. మరో 1,425 మందికి కంటి స్క్రీనింగ్ నిర్వహించి, చూపుసరిగా లేక బాధపడుతున్న 415 మందికి అద్దాలను అందజేశారు. వైద్య శిబిరాల్లో 63 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 30 మంది స్పెషలిస్టులు పాల్గొని వైద్యసేవలు అందించారు.

నేడు జిల్లాలోని 21 ప్రాంతాల్లో శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం జిల్లాలోని 21 ప్రాంతాల్లో జరగనున్నాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. కనగానపల్లి మండలం నరసంపల్లి, ధర్మవరం మండలం ధర్మపురి, బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి, తాడిమర్రి మండలం దాడితోట-2 సచివాలయం, ముదిగుబ్బ మండలం ముక్తాపురం, తలుపుల మండలం కుర్లి, ఎన్పీకుంట మండలం దనియాన్ చెరువు, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి-3 సచివాలయం, నల్లమాడ మండలం గోపేపల్లి, మసకవంకపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల-2 సచివాలయం, రామగిరి మండలం మోటారు చింతలపల్లి, మడకశిర ఆమిదాలగొంది-1 సచివాలయం, గుడిబండ మండలం దొడ్డేరి, పెనుకొండ మండలం వెంకటగారి పాళ్యం, నల్లచెరువు మండలం తలమర్లవాండ్లపల్లి, అమడగూరు మండలం చినగానిపల్లి, గోరంట్ల మండలం వానవోలు-1 సచివాలయం, సోమందేపల్లి మండలం మండ్లి, హిందూపురం మండలం బాలంపల్లి, లేపాక్షి మండలం పులమతి, హిందూపురంలోని లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్ పరిధుల్లో జగన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు.

ఎస్కేయూలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగం కొనసాగింపు

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని 2023-24 విద్యా సంవత్సరం వరకూ కొనసాగిస్తున్నట్టు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య తెలిపారు. ఏపీ పీజీసెట్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసిన విద్యార్థులు రెండో దఫా కౌన్సిలింగ్‌లో ఆప్షన్ పెట్టుకుని ఈ విభాగంలో చేరవచ్చునని పేర్కొన్నారు. కాగా, పీజీ సెట్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉన్నారు. అయితే అనాలోచితంగా కోర్సును రద్దు చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవడంపై ఉన్నత విద్యా మండలి ఆక్షేపణ తెలిపింది. అలాగే గత వారం రోజులుగా అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు కొనసాగాలని వర్సిటీలో ఆందోళనలు, రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. దీంతో ఉన్నత విద్యామండలి ఆదేశాలమేరకు ఈ ఏడాది కోర్సు కొనసాగింపునకు వర్సిటీ యాజమాన్యం ఆమోదం తెలిపింది.

టెక్ విద్యార్థులకు 'ఉపకారం'

- ప్రతిభావంత విద్యార్థుల ప్రగతికి ఊతం
- ఏఐసీటీఈ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల మంజూరు

అనంతపురం: మెరిట్ ఉన్నా ఆర్థిక పరిస్థితి సరిగా లేని కారణంగా చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చేయూత అందిస్తోంది. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న వారి కోసం ఉపకార వేతనాలను అందజేస్తోంది. ఇప్పటికే ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి కావడంతో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ఉపకార వేతనాలు మంజూరయ్యే అవకాశం ఉంది. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్ https://aicte@india.org/ లో తెలుసుకోవచ్చు. అర్హత ఉన్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ https://scholarships.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'ప్రగతి' పథంలో బాలికలు

సాంకేతిక డిగ్రీ, ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న బాలికల అభ్యున్నతికి సాయం అందించడమే 'ప్రగతి' పథకం లక్ష్యం. ఇంటర్మీడియట్/పదో తరగతి మార్కుల ఆధారంగా ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరం రెగ్యులర్ లేదా, లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరం చదువుతున్న అమ్మాయిలు అర్హులు. ఏఐసీటీఈ ఆమోదించిన విద్యా సంస్థలు, కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. గరిష్టంగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలికలకు ఉపకార వేతనం మంజూరు చేస్తారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల లోపు ఉండాలి. ఏటా 5 వేల మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారు. డిగ్రీ విద్యార్థులకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున గరిష్టంగా 4 సంవత్సరాలు అందిస్తారు. ఇందులో ట్యూషన్ ఫీజు కింద రూ.30 వేలు, కంటిన్‌జెన్సీ గ్రాంట్ కింద ఏటా (10 నెలలు) రూ.20 వేలు ఇస్తారు. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉన్న విద్యార్థులకు ల్యాప్‌టాప్, పుస్తకాలు, వాహనం వంటి వాటిని కొనుగోలు చేయడానికి రూ.30 వేలు ఇస్తారు.

దివ్యాంగులకు ఏఐసీటీఈ 'సాక్షం'

దివ్యాంగులను ఉన్నత విద్యలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏఐసీటీఈ ఏటా సాక్షం పేరుతో స్కాలర్‌షిప్ అందజేస్తోంది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.50 వేలు చొప్పున మంజూరు చేస్తారు. బీటెక్ విద్యార్థులకు గరిష్టంగా 4 సంవత్సరాలు, డిప్లొమో వారికి గరిష్టంగా మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్పు అందుతుంది. కళాశాల ఫీజు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు, పుస్తకాలు, పరికరాలకు వీటిని వెచ్చించాల్సి ఉంటుంది. వైకల్యం కనీసం 40 శాతం కన్నా ఎక్కువ ఉండాలి. కుటుంబ ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. సాక్షం కింద ఏటా అత్యధికంగా 5 వేల మందికి ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. డిప్లొమా లేదా డిగ్రీ కోర్సులను చదివే దివ్యాంగులు ఈ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

అనాథలకు దన్నుగా 'స్వనాథ్'

కరోనా మహమ్మారి కారణంగా వేలాది మంది పిల్లలు నిరాశ్రయులయ్యారు. తల్లిదండ్రులను కోల్పోయిన వారి చదువు, భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఇలాంటి పిల్లలకు ఉన్నత విద్యలో చేయూతనిచ్చేందుకు స్వనాథ్ పేరుతో ఏఐసీటీఈ కొత్త స్కాలర్‌షిప్‌ను 2021-22 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. కోవిడ్-19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన వారితో పాటు సాయుధ దళాలు , సెంట్రల్ పారామిలిటరీ దళాల్లో విధినిర్వహణలో అమరులైన జవాన్ల పిల్లలకు ఈ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది. ఏటా 2 వేల మందిని ఎంపిక చేస్తారు. ఇందులో వెయ్యి చొప్పున బీటెక్, డిప్లొమా విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఏటా రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్ మంజూరవుతుంది. అయితే అభ్యర్థి ఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లేదా ఏఐసీటీఈ సంబంధిత ఉపకార వేతనం పొంది ఉండకూడదు.





దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది.

అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.

మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.



"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్ణగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు.



ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు. సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

టిప్స్



● రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.
ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

● కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్‌ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బుట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షొలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షొలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.


● మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

హాబీతో వయసును ఓడించాను

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.








రవి బాల శర్మ

కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.